# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 11-12-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ ప్రపంచంలోని అగ్రగామి డిజిటల్ ఆర్థిక వ్యవస్థలలో భారతదేశం ఒకటిగా నిలుస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు.
- ❖ లోక్‌సభ ఈరోజు భారతీయ రైల్వే సవరణ బిల్లు 2024ను మూజువాణి ఓటుతో ఆమోదించింది.
- ❖ భారతదేశం 2035 నాటికి సొంత అంతరిక్ష కేంద్రాన్ని సిద్ధం చేస్తుందని కేంద్రసహాయ మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడించారు.
- ❖ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 26వ గవర్నర్ గా సంజయ్ మల్హోత్రా ఈ రోజు బాధ్యతలు స్వీకరించారు.
- ❖ సామాజిక మాధ్యమాల్లో మహిళలను వేధించిన వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచంలోని అగ్రగామి డిజిటల్ ఆర్థిక వ్యవస్థలలో భారతదేశం ఒకటని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. “స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2024” ముగింపు వేడుకల సందర్భంగా యువ ఆవిష్కర్తలతో జరిగిన సంభాషణలో న్యూఢిల్లీ నుండి ఈ రోజు దృశ్య మాధ్యమం ద్వారా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ… దేశం ఎదుర్కొంటున్న అనేక సవాళ్ళకు సరైన జవాబును యువ ఆవిష్కర్తలు అందించగలరన్న దృఢ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. భారతదేశ భవిష్యత్తుకు ఈ పరిష్కారాలు చాలా కీలకమని, లక్షలాది మంది జీవితాలను మార్చగలవని ప్రధానమంత్రి అన్నారు. యువ ఆవిష్కర్తల నుండి తాను చాలా కొత్త విషయాలను నేర్చుకుంటానని ఆయన పేర్కొంటూ…

(వాయిస్ 40 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

సామాజిక మాధ్యమాల్లో మహిళలను వేధించి అప్రతిష్ట పాలు చేసే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవచ్చని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. సామాజిక మాధ్యమాలను దుర్వినియోగం చేస్తూ.. ఇతరులను దూషించటం సహా సైబర్ నేరాలకు పాల్పడే వారిపై  చట్ట బద్ధమైన చర్యలు తీసుకోవచ్చని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో వెల్లడించింది. భారతీయ న్యాయ సంహిత 2023 చట్టం సెక్షన్-78 ప్రకారం మహిళలను వేధించే వారిపై, అప్రతిష్టపాలు చేసే వారిపై కూడా చర్యలు తీసుకోవచ్చునని తెలిపింది. ఇటువంటి కేసుల విషయంలో సంబంధిత చట్టంలోని సెక్షన్ ప్రకారం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కూడా చర్యలకు ఉపక్రమించవచ్చునని పేర్కొంది. తెలుగుదేశం పార్టీ ఎంపీ బైరెడ్డి శబరి అడిగిన ప్రశ్నకు సమాధానంగా పార్లమెంట్ లో కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఈ వివరాలను వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

లోక్‌సభ ఈరోజు భారతీయ రైల్వే సవరణ బిల్లు 2024ను మూజువాణి ఓటుతో ఆమోదించింది. రైల్వే బోర్డు అధికారాన్ని మెరుగుపరచడానికి సమర్ధవంతమైన స్వతంత్రతో కూడిన పనితీరును అందించడానికి ఈ బిల్లు ఉపయోగపడుతుంది. బిల్లుపై చర్చకు రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ సమాధానమిస్తూ... చట్టపరమైన  అంశాలను సులభతరం చేసేందుకే ఈ బిల్లును తీసుకొచ్చామని తెలిపారు. గత 10 సంవత్సరాల్లో రైల్వే మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు పెద్ద ఎత్తున చర్యలు తీసుకున్నామని అన్నారు. రైళ్లలో మూడు లక్షల 10 వేలకు పైగా కొత్త టాయిలెట్లు ఏర్పాటు చేశామని పేర్కొంటూ....

(వాయిస్ 29 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) 26వ గవర్నర్ గా సంజయ్ మల్హోత్రా ఈ రోజు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఆర్బీఐ గవర్నర్ గా సేవలందించిన శక్తికాంత దాస్ పదవీకాలం నిన్నటితో ముగిసింది. ఈ క్రమంలోనే ఆయన స్థానంలో సంజయ్ మల్హోత్రా పేరును కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదించింది. ఈరోజు గవర్నర్ గా బాధ్యతలు స్వీకరించిన మల్హోత్రా 3 సంవత్సరాల పాటు పదవీలో కొనసాగనున్నారు. సంజయ్ మల్హోత్రా 1990 రాజస్థాన్ బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. ఐఐటీ కాన్పూర్‌లో కంప్యూటర్ సైన్స్‌లో ఇంజినీరింగ్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. అమెరికాలోని ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ నుంచి పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ అభ్యసించారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం 2035 నాటికి తన సొంత అంతరిక్ష కేంద్రాన్ని సిద్ధం చేసుకోనుందని కేంద్ర శాస్త్ర సాంకేతిక  అంతరిక్ష శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. 2040 నాటికి చంద్రుడిపై భారతీయుడు కాలు మోపే అవకాశం ఉందని తెలిపారు. కేంద్ర శాస్త్ర సాంకేతిక అంతరిక్ష మంత్రిత్వ శాఖలు ఈ ఏడాది ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కార్యక్రమాల గురించి ఢిల్లీలో ఈ రోజు నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరించారు. చంద్రునిపై భారతీయ వ్యోమగామిని పంపాలనే ప్రణాళికలతో అంతరిక్ష పరిశోధనలు సాగుతున్నాయని అన్నారు.

(వాయిస్ 21 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

గడిచిన దశాబ్ద కాలంలో భారత అణుశక్తి సామర్థ్యం రెండింతలు అయిందని కేంద్ర శాస్త్ర సాంకేతిక అణుశక్తి శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. లోక్‌సభలో ఈ రోజు ఆయన మాట్లాడుతూ... గత 10 సంవత్సారాల్లో 4 వేల 780 మెగావాట్ల నుంచి 8 వేల 081 మెగావాట్లకు అణుశక్తి సామర్థ్యం పెరిగిందని తెలిపారు.  2014 నుంచి అణుశక్తి

రంగంలో ఎంతో అభివృద్ధి జరిగిందని అన్నారు. గడిచిన 60 ఏళ్లలో సాధించలేనిది, గత రెండు దశాబ్ధాలలో సాధించామని వెల్లడించారు. ఇక 2031-32 నాటికి అణుశక్తి ఉత్పాదక సామర్థ్యం 22 వేల 480 మెగావాట్లకు పెరగనున్నట్లుగా అంచనా వేస్తున్నామని జితేంద్ర సింగ్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

లోక్‌సభలో ఈ రోజు ప్రతిపక్ష సభ్యులు మణిపూర్ సంక్షోభంపై, భారతీయ వ్యాపారవేత్త ముడుపుల వ్యవహారంపై చర్చ జరపాలని పట్టుబట్టారు. ఈ క్రమంలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం నెలకొనడంతో సభ వాయిదాపడింది. మరోవైపు రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌కర్ వ్యవహార తీరుపై అసంతృప్తి చెందిన ప్రతిపక్షం అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు నోటీసులిచ్చింది. అయితే అవిశ్వాస తీర్మానంపై అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం నెలకొంది. దీంతో రాజ్యసభ రేపటికి వాయిదా పడింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ వ్యాప్తంగా ద్రవ్యోల్బణం ప్రధానమైన అంశంగా మారిందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో CII గ్లోబల్ ఎకనామిక్ పాలసీ ఫోరమ్ ప్రారంభ సర్వసభ్య సమావేశంలో ఈ రోజు ఆమె ప్రసంగించారు. ద్రవ్యోల్బణాన్ని అధిగమించేందుకు పరస్పర సహకారం అవసరం ఉండాలని పేర్కొన్నారు. సాంకేతిక రంగంలో పెట్టుబడులు పెట్టడం ద్వారా ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. అదే విధంగా భారీ పరిశ్రమలు చిన్న మధ్యతరహా పరిశ్రమలతో కలిసి ఉద్యోగాల కల్పనకు కృషి చేయాల్సి ఉందని సీతారామన్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యులు తనపై చేసిన అవమానకర వ్యాఖ్యల్ని తొలగించాలని స్పీకర్ ఓంబిర్లాను కోరారు. పార్లమెంటు వెలుపల ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... సభ సజావుగా జరగాలని, చర్చ జరగాలన్నదే తమ పార్టీ విధానమని అన్నారు. కీలకమైన అంశాల మీద ప్రభుత్వం సభలో చర్చను కోరుకోవడం లేదని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

సిరియాలో నెలకొన్న పరిస్థితుల మధ్య అక్కడున్న భారతీయులను వెనక్కి రప్పించేందుకు భారత విదేశాంగ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. దీనిలో భాగంగానే తాజాగా 75 మంది భారత పౌరులను డమాస్కస్ నుంచి లెబనాన్‌కు సురక్షితంగా తీసుకొచ్చింది. ఈ విషయాన్ని విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది. మొత్తం 75 మంది భారతీయుల్లో 44 మంది జమ్మూకశ్మీర్‌కు చెందిన యాత్రికులు ఉన్నారని మంత్రిత్వశాఖ పేర్కొంది. వారంతా సిరియా సరిహద్దులు దాటి క్షేమంగా లెబనాన్‌కు చేరుకున్నట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. అక్కడ నుంచి వారంతా వాణిజ్య విమానాల ద్వారా లెబనాన్ నుంచి త్వరలోనే స్వదేశానికి చేరుకోనున్నారని వెల్లడించింది. ఇంకా అనేక మంది భారతీయులు సిరియాలో ఉన్నారని తెలియజేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో ఈ రోజు సోదాలు నిర్వహించింది. ఈ రాష్ట్రాల్లో ఉగ్రవాద గ్రూపుల కార్యకలాపాలను నిరోధించడానికి ఎన్ఐఎ దృష్టి పెట్టింది. దర్యాప్తులో భాగంగా పంజాబ్, హర్యానాలో సోదాలు నిర్వహించింది. హర్యానాలోని పాల్వాల్, ఫరీదాబాద్, గురుగ్రామ్ జిల్లాలు, పంజాబ్‌లోని జలందర్ జిల్లాలో, ఉత్తరప్రదేశ్‌లోని మథుర జిల్లాలో జాతీయ దర్యాప్తు సంస్థ సోదాలు నిర్వహించింది. ఈ సోదాలలో మొబైల్ ఫోన్లు, డిజిటల్ పరికరాలు, బ్యాంకు లావాదేవీలు, ఆస్తులకు సంబంధించిన పత్రాలను ఎన్ఐఎ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ఈ కేసులో ఎన్ఐఎ దర్యాప్తు కొనసాగిస్తోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = =